సాంబశివంగారు భయస్థులని లోకంలో ఒకప్రతీతి వుంది. కానీ ఆప్రతీతి పూర్తిగా నిజంగాదు. ఆయన భయం ఓపరిమిత వలయంలో గిరికీలుకొడుతుంది. ఆ వలయానికి అవలివైపున సాంబశివంగారు ధైర్యంలో నెపోలియనులాంటి మనిషి. ఆయనకు చీకటి, దయ్యాలు, అంటు రోగాలు, మృత్యువు ఇలాటివి భయ కారణాలు గావు. నెపోలియను అంతటి వీరుడుగదా మరి. ఆయనకు ఉష్అంటే కలుగుల్లోకి పారిపోయే ఎలుకలంటే చెప్ప రానంత భయమని చెబుతారు. సరిగ్గా అలాగే సాంబశివంగారికి తమ ఉద్యోగానికి సంబంధించిన భయా లెక్కువ. టచింగు నోట్సు రాయకపోతే హెడ్మాస్టరు ఏమం టాడో! వేళకు బడికి చేరుకోకపోతే లేటు మార్కు పడుతుందేమో! 'కొశ్చన్ పేపరు' అవుటయిపోతే పైఅధికారులు తనపైన తగుచర్య తీసుకుంటారేమో! సాంబశివం గారి కిలాటిభయాలు ఒకటిపోతే ఒకటి ఎదురౌతూనే వుంటాయి. జీవితంపట్ల సాంబశివంగారి తాత్విక దృక్పథాన్ని శ్రద్ధగా పరిశీలిస్తే యిందుకొక కారణం కనిపిస్తుంది. చావడంగానీ బ్రతకడంగానీ మనచేతుల్లోలేదు. నువ్వు పురుగు, పుట్రా వుంటాయని చీకటిల్లో బయటికి పోకుండా యింట్లోనే కూచోవచ్చు. పరీక్షిత్తు కూడా అలాగే చేశాడు. చివరికేమైంది?...బ్రతికి వంతవరకూ పొటపూడ్చుకోక తప్పదు. అందుకు ఉద్యోగనిర్వహణ వినాగత్యంతరం లేదు. ఏదిలేకపోతే తనకు బ్రతుకులేదో, దాన్ని శ్రద్ధగా, లోపరహితంగా నిర్వర్తిం చడం మానవుడికర్తవ్యం కాదా మరి!

ఇక పార్వతమ్మ ఉందంటే, ఆమెధోరణి యిందుకు పూర్తిగా విరుద్ధం. దేనికోసమైతే భయపడి లాభం లేదో, దానికోసమే భయ పడటం ఆవిడ స్వభావం. వీధిలో నిల్చుని ఓ బిచ్చగాడు 'అమ్మా! ఆకలి' అని అరు స్తాడు. 'వెళ్లా, వెళ్ళు. ఇంకా అన్నం కాలేదు' అన్నమాట పార్వతమ్మ నాలుక చివరిదాకా వస్తుంది. కానీ అంతలోనే— ఒకభయం ఆ మాటకు అడ్డు తగులుతుంది. 'ఇకపైన రాబోయే జన్మలో తనే ఆవిధంగా ముష్టికి వచ్చి ఆ బిచ్చగాడే యింటి యజ మానుడై తనని వెళ్ళిపొమ్మని కసురుకుంటే!' ఆ భయంతోనే పార్వతమ్మ బిచ్చగాడికి పట్టెడన్నం విదిలిస్తుంది.

'ఈరోజు ఓ కుర్రాడి లెంపలు వాయిం చేశాను' అంటారనుకోండి, సాంబశివంగారు ఆయనలా అనగానే పార్వతమ్మలో భయం చెలరేగుతుంది. 'ఊరివారి బిడ్డను నగరివారు కొడితే, నగరివారి బిడ్డను నారాయణుడు కొడతా' డంటారు. ఈయనకూ నలుగురు బిడ్డలున్నారు. ఈయన వాడినెవడినో కొట్టి నందుకు ప్రతిఫలంగా, వీళ్ళను మరెవరైనా చావబాదితే?'

## మధురాంతకం రాజారాం

అలాటి సాంబశివంగారికీ, యిలాటి పార్వతమ్మకూ ఓరోజు సాయంత్రం జరి గిన సంభాషణలో ఈ కథ ప్రారంభమవు తుంది.

ఆ సాయంత్రం సాంబశివంగారు హడా వుడిగా స్కూలునుంచి యింటికి వచ్చారు. చేతి సంచీలోనుంచి కాగితాలకటని పైకితీసి టేబిల్ పైన వుంచారు. కళ్ళజోడు తీసి, అంగవస్త్రంతో తుడుచుకుంటూ "ఇదిగో.. ఏమిటే... ఎక్కడున్నావ్" అని లోపలికి కేక వేశారు.

"ఏమండీ! ఏం కావాలి?" అంది నింపా దిగా వంటగదిలోనుంచే పార్వతమ్మ.

"బ్రతికాను! 'నరుడా, ఏమి నీకోరిక' అని అడిగావు కావు. ఆ తాళంచెవి యిలా తీసుకురా" అన్నారు సాంబశివంగారు.

స్కూలునుంచి యింటికిరాగానే సాంబ శివంగారు తాళంచెవికోసం కేక వేయడ మన్నది నెలకంతా ఒక్కసారి మాత్రమే జరిగే సంఘటన! ఆయనలా కేక వేస్తారు. పార్వతమ్మ తాళం చెవి తెచ్చియిస్తుంది. ఆయన పెట్టెతీసి జేబులోని డబ్బును అందులో భద్రపరుస్తారు.

కానీ ఈదఫా అలాటిదేమీ జరుగలేదు. సాంబశివంగారు పెట్టెలోని బట్టల్ని అటూ యిటూ తొలగదోసి, టేబిలుపైన పెట్టిన కాగితాలకట్టను తీసి అందులో వుంచి మూతవేసేశారు.

"అదేమిటండీ! ఎక్కడవేస్తే అక్కడ పడివుండే కాగితాల్ని అలా జాగ్రత్త చేస్తు న్నారు." అంది పార్వతమ్మ. ఉద్యోగు లందరిలోనూ బడిపంతుళ్ళపట్ల లోకులకు చిన్నచూపు వున్నట్టే, బడిపంతుళ్ళ యిళ్ళల్లో అన్ని వస్తువులకన్నా కాగితా లకూ, పుస్తకాలకు కనీసపు గౌరవాదరణలు లభ్యమౌతున్నాయి. ఓసారి పార్వతమ్మ పుట్టిలో పాలచెంబు పైన వుంచిన మార్కుల రిజిష్టరు, పిల్లికీ చెంబుకూ జరిగిన సంఘర్ష ణలో, నీళ్ళతబిలలో పడి 'మార్కుల రాజ్యం'లో గరీబు, నవాబు అంతరాలు మాసి సోషలిజం సిద్ధించిన సంఘటన యిందుకు ప్రబలనిదర్శనం!

పార్వతమ్మ అమాయకత్వానికి సాను భూతి ప్రకటిస్తున్నవారిలా మెల్లగా నవ్వుతూ సాంబశివంగారు "ఓసి వెర్రి మొహమా! అవేం కాగితాలనుకున్నావు? గవర్నమెంటు పరీక్ష పేపరు. రాక రాక యింత కాలానికొచ్చాయి. ఒక్కొక్క పేపరుకూ ముప్పావలా చొప్పున నాలుగువందల పేపర్లకు మూడువందలు ఒక్కసారిగా కళ్ళ బడతాయన్నమాట; ఏమిటనుకున్నావో" అన్నారు.

"మూడొందలే! వాడెవడండీ, యింతగా డబ్బును రాసిపోసుకున్న పుణ్యాత్ముడు! ఇలా అందరికీ డబ్బుదోచిపెడ్తే వాడి సంసా రమేం గతెక్కనబ్బా!" పార్వతమ్మ ముక్కుమీద వ్రేలేసుకుని విస్తుపోసాగింది.

సాంబశివంగారు చిరాకుతో నుదురు చిట్లించి "ఐనా నీకు బోధపరచడం ఎవరి చేతనౌతుంది? ఇవి గవర్నమెంటువాళ్ళు స్వయంగా వడిపే పరీక్షలతాలూకు పేపర్లన్న మాట. గవర్నమెంటు వాళ్ళకేం డబ్బుకు కొదవా?" అన్నారు.

"అంతగా డబ్బుకు కొదవలేనివాళ్లు, మీరు ప్రతివారమూ బోలెడన్ని పుస్తకాలు సరిచూస్తున్నారుగదా, పుస్తకానికొక పావలా చొప్పున పారేయకూడదటండీ?"

"అది ఉద్యోగరీత్యా తప్పనిసరిగా చేయ వలసిన పని. ఇది అదనంగా చేయవలసి

వస్తున్న పని, దానికీ, దీనికీ తేడావుంది."

పార్వతమ్మకా సమాధానమేమీ తృప్తికరంగా లేదు. ఐనా మూడువందల రూపాయలు లభ్యం కాబోతున్నాయి గనుక ఏ రాజు ఏ రాజ్యం పాలిస్తే మనకేమున్న తృప్తితో ఆమె లోపలికి వెళ్ళిపోబోయింది.

"ఇదుగో" అని మళ్ళీ ఆమెను దగ్గరికి పిలిచి "నీ నోట్లో నువ్వు గింజయినా నానదు. మనకు పేపర్లొచ్చాయన్న సంగతి వీధిలో నిలబడి బాకా వూదేసేవు! చాలా రహస్యంగా వుండాలి, తెలుసా!? అన్నారు సాంబశివంగారు.

"పైగా యిదొకటా! ఐనా ఆ పేపర్ల గొడవ నాకెందుకండీ! ఏమో, డబ్బొస్తుందంటున్నారు. వస్తేగిస్తే అమ్మాయికి రెండు జతల గాజులు చేయించండి. పెళ్ళికన్నీ ఒక్కసారిగా చేయాలనుకుంటే, మనవల్ల కాదు."

"మరి నాకు గడియారమో" అంటూ గదిలోనుంచీ బయటికి వచ్చాడు, అంతవరకూ తల్లిదండ్రుల ప్రసంగాన్ని వింటూ వుండిన శంకరం.

"అది నువ్వు పరీక్ష పాసైతే, ఆ తరువాతి మాట" సూటిగా బదులు చెప్పారు సాంబశివంగారు.

"వాడెందుకు పరీక్ష కాడండీ, మీరు మరీనూ! ఇదివరకెన్నిసార్లు వాడు పరీక్ష కాలేదు? ఇచ్చేవాళ్ళు సరిగా మార్కులిస్తే వ్రాళ్ళెందుకు పరీక్ష కారు?" అంది పార్వతమ్మ.

"అదీ! నాన్నగారికి పేపర్లొచ్చిన ఈ శుభసమయంలో నవు గట్టిగా అడగవలసిన మాట అదేనమ్మా!" అన్నాడు శంకరం.

"బాగా వ్రాసి ఏడిస్తే, మార్కులు వాటంతట అవే వస్తాయి. ఎందుకు రావు?" అంటూ సాంబశివంగారు కాళ్ళూ, చేతులు కడుక్కోడానికి పెరట్లోకి వెళ్ళారు

* * *

నాలుగు రోజుల తర్వాత ఓ సాయంత్రం యింట్లో ఏదో పనిచేసుకుంటున్న పార్వతమ్మకు "సార్, సార్" అని ఓ అపరిచిత కంఠం పిలవడం వినిపించింది.

"ఎవరూ, ఎవరు" అంటూ ఆమె బయటికి రాబోతుండగా, ఆగంతకుడే వరండా దాటుకుని హాల్లోకి వచ్చేశాడు.

వచ్చిన వాడు, బరువుగా వున్న చేతి సంచిని గోడకానించి "నమస్కారమండీ" అంటూ పార్వతమ్మకు చేతులు జోడించాడు.

ఏ అమ్మగన్న బిడ్డో గానీ, అంత ఒడ్డూ పొడవూవున్న యువకుడు చేతులెత్తి తనకు నమస్కరించినందుకు పార్వతమ్మకు ప్రాణం వచ్చినట్టయింది. 'అయ్యో, పాపం' అని మనసులో నొచ్చుకుంటూ "కూచో నాయనా కూచో! ఏ వూరు బాబూ" అని ఆమె ఆప్యాయంగా పలకరించింది.

ఆగంతకుడు గోడకానుకుని, ఏదో నేరం చేసినవాడిలా తలవంచుకుని నేలవైపు చూస్తూ "విశాఖపట్నంనుంచి వస్తున్నానండీ!" అన్నాను.

"విశాఖపట్నంనుంచే! అమ్మో, అంత దూరమే! ఎవరికోసం వచ్చావు నాయనా" అంది పార్వతమ్మ

అపరిచితుడీసారి పైకప్పుకేసి చూపు్కులు నిగుడించాడు. ఆతరువాత, విశాఖపట్నం నుంచి రైల్లో ప్రయాణంచేసి వచ్చినందుకు తార్కాణగా నల్లగా మాసిపోయివున్న తన దుస్తులవైపోసారి చూచుకున్నాడు. గుబురుగా పెరగనుంకిస్తున్న గడ్డాన్ని ఒకసారి ఎడమచేతితో పరామర్శించుకున్నాడు. ఇన్నీ చేసిన తర్వాత ఏడుపు ముగం పెట్టి "పంతులుగారు లేరండీ?" అన్నాడు.

పార్వతమ్మ మేడ మెట్లు దగ్గరకువెళ్ళి "ఏమండోయ్! మిమ్మల్నే! ఇలారండి" అని సాంబశివంగారిని పిలిచింది.

చేస్తూచేస్తూవున్న పనిని మధ్యలోవిడిచిపెట్టి, ఎర్రసిరాకలాన్ని అలాగే చేతిలో వుంచుకుని సాంబశివంగారు మెట్లు దిగి క్రిందికి వచ్చేశారు.

"మీకోసం ఈ అబ్బాయెవరో విశాఖ



"ఇన్నై విందు"—ప్రతిశుక్రవారము రేడియో సిలోన్ 41.72 మీటర్లమీద సాయంత్రం 6-30 నుండి 6-45 వరకు విని ఆనందించండి.

# ★ అడ్డు దారి ★

పట్నంనుంచీ వచ్చాడటండీ" అంటూ పార్వతమ్మ ఆ యువకుణ్ణి సాంబశివంగారికి పరిచయం చేసిపెట్టింది.

"నాకోసమా! ఈ అబ్బాయా? ఎందుకొచ్చావయ్యా?" అన్నారు సాంబశివం గారు.

ఆగంతకుడు కాసేపు దిక్కులుతోచని వాడిలా నిస్తబ్ధుడై వుండిపోయాడు. కళ్లల్లో క్రమ్ముకుంటున్న కన్నీటిని ఆ భార్యాభర్తలెక్కడ చూచిపోతారోనని దుఃఖాన్ని ఆపుకోడానికి వృథాప్రయత్నాలు చేశాడు. కానీ అతడు నోరు తెరిచేసరికి కంఠం గద్గదికమే అయిపోయింది.

"మాది చాలా పేదకుటుంబం సార్! మా నాన్నగారికి కళ్ళు కనపడవు. అక్కడా, యిక్కడా చాకిరీచేసి ఇందాకా మా అమ్మే కాపురాన్ని నెట్టుకొచ్చింది. వాళ్ళ ఆశలన్నీ నా పైన్నే వున్నాయిసార్! వాళ్ళు ఒకపూటతింటే, రెండుపూటలు తినకుండా నన్ను చదివించారు. నేను పరీక్ష ఫెయిలయ్యానంటే వాళ్ళగుండెలు పగిలిపోతాయి. ఇవి చేతులుగావు, కాళ్ళనుకోండిసార్..."

చేతుల్ని దూరంగా తీసుకుంటూ సాంబశివంగారు "ఏమిటయ్యా నీ గొడవ? నువ్వు పరీక్ష ఫెయిలు కాబోతున్నందుకు, నాకూ సంబంధమేమిటి?" అన్నారు

"అన్ని సబ్జక్టూ బాగానే వ్రాశాను సార్! దేనిలోనూ ఫిఫ్టీ పర్సెంటుకు తగ్గదు. ఒక్క యింగ్లీషులోమాత్రమే డౌటుగా వుంది. ఇంగ్లీషు పేపర్లు మీ దగ్గరికొచ్చాయని తెలిసింది..."

"నా దగ్గరకా: పేపర్లొచ్చాయా? అబద్ధం. నాకు పేపర్లే రాలేదే!"

పార్వతమ్మ సాంబశివంగారు నిండుచెరువులో నీళ్ళు లేవంటున్నందుకు ఆశ్చర్యపడకుండా వుండలేకపోయింది. ఈయన సత్యహరిశ్చంద్రుడు గాకపోయినా, పచ్చి అబద్ధాన్ని కుండ బద్దలుకొట్టినట్టుగా చెప్పేయగలరని ఆమె ఏ నాడూ అనుకోలేదు!

"మీ రలాగంటే నేనేం చెప్పగలను సార్?" అంటూ ఆగంతకుడు వేళ్ళు నలుపుకోసాగాడు.

క్షణక్షణానికీ విచారమేఘాలు అలముకుంటున్న అతడి ముఖాన్ని చూస్తుంటే పార్వతమ్మకు గుండె తరుక్కుపోసాగింది. ఇంగ్లీషు పేపరులో మార్కుల సంగతి ఎలా వున్నా మొదట అతనికి పట్టెడన్నం చాలా అవసరమనిపించింది పార్వతమ్మకు!

"నువ్వెప్పుడు భోంచేశావు బాబూ?" అంది పార్వతమ్మ.

"విజయవాడలో రైలాగితే పెరుగన్న పొట్లం ఒకటి కొనుక్కున్నానండీ! ఆతరువాత బిట్రగుంటలో ఓ కాఫీ త్రాగాను. గూడూరి కొచ్చేసరికి బాగా రాత్రయిపోయింది..."

సాంబశివంగారు అతడివైపు చూచి ముఖం చిట్లించుకున్నారు. ఆ చిట్లించుకోడంలో ఈ వ్యవహారం ఆయనకేమాత్రమూ నచ్చలేదన్న భావం ఎవరికైనా వ్యక్తమవుతుంది, ఒక్క పార్వతమ్మకు తప్పా!

"నాకెలాగూ యిరవై మార్కులొస్తాయి సార్! మీరింకొక పదిమార్కులు..."

సాంబశివంగారు కోపాన్ని పిలిచారు. అది పిలవగానే పలికింది!

రూక్షవీక్షణాలతో ఆయన ఆగంతకుణ్ణి దహించివేస్తూ "నీకు మంచి మాటలతో చెబుతున్నాను. పోనీ అని వూరుకున్నాను గానీ లేకపోతే, ఓ చీటీ వ్రాసి పంపి పోలీసుల్ని రప్పించడం నాకొక పెద్దపని గాదు. వీలైనంత త్వరగా యిక్కడినుంచి వెళ్ళిపోవడం నీకన్నివిధాలా శ్రేయస్కరం" అని ఆదరాబాదరాగా మెట్లెక్కి మేడపైకి వెళ్ళిపోయారు.

ఆయన మేడపైకి వెళ్ళిపోవడమేమిటి, క్రికెట్ బ్యాటు వూపుకుంటూ శంకరం లోపలికి రావడమేమిటి, రెండూ ఒక్కసారే జరిగాయి.

"నువ్వూ వున్నావు, ఎందుకురా శంకరం! ఈ అబ్బాయిని చూడు, ఏం లేదు, పది మార్కుల భాగ్యానికి విశాఖపట్నంనుంచి ఈ వూరొచ్చాడు! మరి మీ నాన్నగారేమైనా చెబితే వినేరకమా! తెట్టతేరవు యితడిపైన మండపడిపోతున్నారు." అంది పార్వతమ్మ.

తండ్రిగారి పెడసరితనాన్ని తల్లి భోళాతనాన్ని బాగా గుర్తెరిగిన శంకరం ఈ పరిస్థితిలో ఏం చెప్పడానికీ తోచక మౌనంగా వుండిపోయాడు.

ఆగంతకుడు చేతిసంచీ పైకితీశాడు. అందులోవున్న వాటిని ఒక్కొక్కటిగా తీసి టేబిలు పైనవుంచాడు. ఓ డజను కమలాపళ్ళు ఒక చీపు అరటి పళ్ళు, పువ్వులు...

"అయ్యో పాపం! ఇవన్నీ ఎందుకు తీసుకొచ్చావు బాబూ?" అంది పార్వతమ్మ.

అతడు మళ్ళీ ఒకసారి పార్వతమ్మకు నమస్కరించాడు. ఓ చీటీపైన నంబరు వేసి, దాన్ని జాగ్రత్తగా టేబిలు పైనవుంచి "ఎంతో ఆశగా యింత దూరం వచ్చాను. మేష్టరుగారు కోపంగా వున్నారు. నేకింకా యిక్కడే వుంటే ఆయనకు మరీ కోపం వస్తుంది. పాలముంచినా, నీటముంచినా మీ దే భారం" అంటూ అతడు తిరిగిచూడకుండా బయటకు వెళ్ళిపోయాడు.


* * *


వెండితెరపైకి వచ్చి వెళ్ళిపోయే బొమ్మలా ఆ విశాఖపట్నం యువకుడు సాంబశివ గారింటికి వచ్చి, విఫలమనోరథుడై, వచ్చిన దారి వెంబడే తిరిగి వెళ్ళిపోయిన తర్వాత ఐదారు నెలలు గడిచిపోయాయి. ఈ అయిదారు నెలలుగా అప్పుడప్పుడు అతని ప్రసక్తి ఆ యింట్లో పొడసూపుతూనే వుంది.

"పాపం, అతడు పరీక్ష తప్పిపోయి వుంటాడు. అంటే ఏమన్నమాట? ఆ సంసారం మీ పుణ్యమా అని చిదికిపోయి వుంటుంది. ఆ కళ్లుగానని కబోది ఏమైపోయాడో? ఇంటింటా చాకిరీచేసి కొడుకును చదివించిన ఆ తల్లిప్రాణం ఎంతగా వుసూరుమందో? ఆ పాపం మనల్ని కట్టికుడుపకమానుతుందటండీ?"

ఇలా భార్య తనని దెప్పినప్పుడల్లా సాంబశివంగారు ఆమెకు కటువుగా సమాధానం చెబుతూనే వున్నారు.

"నువ్వు నూరు చెప్పు, వెయ్యి చెప్పు. నేను చేస్తున్నది నౌఖరీ. నౌఖరీ అంటే నోటిమాటగాదు. బాగా చేసినంతవరకూ మెప్పుదల వుండదు. కానీ తప్పిదారి డ్యూటీలో తప్పటడుగు వేశానో, నీకు కీడు మూడినట్టే! ఎక్స్‌ప్లనేషన్ అడగొచ్చు. ఇంక్రిమెంట్ కట్ చెయ్యొచ్చు. నాలుగు నెలలు సస్పెండ్ చెయ్యొచ్చు. లేదా అమాంతంగా 'ప్రూన్'





చేసి వెళ్ళిరమ్మనవచ్చు! ఏం చేసినా నీ కెవడుదిక్కు? నీ నీతీ, నీ నిజాయితీ నిన్ను కాపాడలేకపోతే, ఆ తరువాత భగవంతుడు సైతం కాపాడలేడు. నువ్వమాయకురాలివి! నీకు లోకంపోకడేం తెలుసు? ఈ రోజుల్లో సజావుగా ఒక పనిచేసి సత్ఫలితం సాధించడానికి ప్రతివాడూ బద్ధకిస్తున్నాడు. ఉద్యోగి వున్నాడనుకో, బాగా శ్రమపడి పనిచేయడానికి బదులు, పై అధికారులమీద ముఖస్తుతుల పన్నీరు చిలకరించి ప్రమోషనులు సాధించుకుంటున్నాడు. ఆడబిడనుగన్న తల్లిదండ్రు లున్నారనుకో, కాళ్ళరిగిపోయేటట్టు తిరిగి వరుణ్ణి వెదికి తెచ్చి కన్యాదానంచేసి సాగనంపడానికి పాలుమాలుతున్నారు. వాళ్ళు పడవలసిన శ్రమంతా ఆ అమ్మాయే పడవలసివస్తోంది! ఇక కుర్రాళ్ళున్నారనుకో, వీళ్ళు చదువరు. రేపు పరీక్షనగా ఈ రోజు రాత్రి సినిమాకు వెళ్ళొస్తారు. వీలయినంత వరకూ పరీక్షల్లో కాపీ కొటడానికి ప్రయత్నిస్తారు. అది సాధ్యంకాకపోతే యిలా గోవువెంట దగిలే కోడెమాదిరిగా ఆ నర్సు పేపర్లని విదుల్చుకుంటూ దేశయాత్రకు సన్నద్ధులవుతారు. నువ్వు మనవూరినుంచీ రామాపురం వెళ్ళాలనుకో! హాయిగా తారురోడ్డు వెంబడే నడిచిపోతే పన్నెండు మైళ్ళు. అలా కాదని అడ్డుదారిపైన వెళ్తే, దూరంలో నాలుగు మైళ్ళు తగ్గుతుంది. నిజమే! కానీ కాలికి రాళ్ళు తగలొచ్చు ముళ్లు గుచ్చుకోవచ్చు. కాలు జారడంవల్ల మనిషి బురదలో ఫల్టీ కొట్టినా కొట్టవచ్చు. వానా వంగిడీ వస్తే తలదాచుకోడానికి వెరవులేక తడిసి ముప్పందుం కావచ్చు. అందుకనే నాకు అడ్డుదోవలంటే ఒళ్ళుమంట..."

అంతగాదు, సాంబశివంగారు మరింతగా విడమరిచి చెప్పినా పార్వతమ్మను పాపభీతి వదిలిపెట్టేదిగాదు. "అయ్యో, ఆ కుర్రాడింకా నా కళ్ళల్లో మెదలుతున్నాడండీ! పాపం, ఆ కాపురమేమయిందో, ఆ తల్లి ఎంతగా ఏడ్చిందో..." పాచిపళ్ళదాసరి పాటలా ఈ గోల యింట్లో వుండి వుండీ పునరావృత్తమవుతూనే వుంది.

ఇంతలో శంకరానికి ఉద్యోగం దొరికి, ఏతదుద్యోగరీత్యా అతడు విశాఖపట్నం వెళ్ళి వెళ్ళిన పదిరోజులకు ఈ క్రింది వుత్తరం గనుక వ్రాయక పోయివుండి నటయితే సాంబశివంగారిని ఈ పీడ జీవితాంతంవరకూ వెన్నంటుతూనే వుండేది!

"పూజనీయులైన తల్లిదండ్రులకు నమస్కారాలు" అంటూ ప్రారంభమైంది ఉత్తరం.


"ఈ వూరు సురక్షితంగా చేరినాను. ఇక్కడి హోటళ్ళలో ఆహారపదార్థాలు మన యింటి భోజనమువలే రుచిగా, శుచిగా వున్నవి. ఈ పట్టణము సముద్రతీరమున వుండుటచేత మండు వేసంగిలో సైతము ఇక్కడ ఎండలు తీక్ష్ణముగా వుండవని చెబుతున్నారు. ఆఫీసు పనుల తొందరలో వ్యవధి లేనందువలన, మిగిలిన విశేషములను మరుజాబులో వ్రాయగలను. అన్నింటికన్నా ముఖ్యమైన విశేషం ఒకటి వున్నది. ఆరునెలలకు మునుపు మార్కులకోసం మన యింటికి వచ్చిన యువకుడు మొన్న బజారులో ఎదురయ్యాడు. నన్ను గుర్తుపటని వాడిలా, చూచీచూడనట్టు వెళ్ళిపోబోయాడు. నేనే అడ్డుతగిలి పలకరించాను. నేనెవరినో తనకు తెలియదని అతడు నన్ను దాటుకుని చరచరా వెళ్ళిపోయాడు. ఆ తరువాత నేనతణ్ణి గురించి విశ్వసనీయవర్గాల్లో వాకబుచేయగా, అతడు యస్. యస్. ఎల్. సి. పరీక్షకు కాదుగదా, రెండోఫారం పరీక్షకు గూడా కూర్చుని ఎరుగడని తెలియవచ్చింది. పరీక్షకు కూర్చుని పేపర్లు తగలేసిన విద్యార్థులదగ్గర ధారాళంగా డబ్బుతీసుకుని, అతడు వాళ్ల తరఫున మార్కుల వేటకోసం బయల్దేరుతాడనీ, ప్రతి సంవత్సరమూ మార్చి అక్టోబరు—రెండు సీజన్లకు కలిసి వెయ్యో, రెండువేలో కళ్ళజూడగలుగుతున్నాడనీ తెలిసింది. ఈసారి అతడెప్పుడైనా కనిపిస్తే తీరికసమయాల్లో అమెచ్యూర్ నాటక సంస్థల్లో చేరి నాటక కళాసేవ చేయమని సలహా యిద్దామనుకుంటున్నాను—"

ఉత్తరం పూర్తిచేసి సాంబశివంగారు పార్వతమ్మకేసి చూచారుగదా, ఆమె ముఖాన కత్తివేటుకు నెత్తురుచుక్క లేదు!

★


వసంతోదయంలో ఉల్లాసం
మీకు నేడు, ప్రతిరోజు కూడా!

కాష్మీర్ బొకే టాల్కమ్ పౌడర్ మహోల్లాసాన్ని కలిగిస్తుంది! అతిమనోహరమైన దీనిని వొంటినిండా చల్లుకుంటే ఉదయపు ఉల్లాసం కలుగుతుంది... మరులుగొలిపే సువాసన, చల్లదనం గంటల తరబడి వుంటుంది. చెమటను పీల్చివేస్తుంది... చర్మం పొట్టురేగకుండా, పెట్లకుండా కాపాడుతుంది... మీ అందాన్ని ఇనుమడింపజేసి, ఆకర్షణశక్తి నధికతరం చేస్తుంది




కాష్మీర్ బొకే
టాల్కమ్ పౌడర్
పురుషులు ప్రేమించే పరిమళం
కాల్గేట్—పామాలివ్ వారి వస్తువు
1806 నుంచి శ్రేష్టతకు కాల్గేట ప్రశస్తిగాంచినది
CBG/14